


# BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్




సంపుటి - 01 సంచిక - 45 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 18-02-2026 బుధవారం పేజీలు : 6

# మున్సిపల్ పోరు ముగింపు

## : 11 మున్సిపాలిటీల్లోనూ ముగిసిన ఛైర్మన్ల ఎన్నిక

### హోరాహోరీగా సాగిన పరోక్ష ఎన్నికలు.. కొన్నిచోట్ల ఉద్రిక్తత, మరికొన్నిచోట్ల ఏకగ్రీవం



2 లో

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (బిఎన్ఎస్ ): తెలంగాణ వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల కోలాహలం నేటితో ఓ ముగింపు దశకు చేరుకుంది. వివిధ కారణాల వల్ల సోమవారం వాయిదా పడిన 11 మున్సిపాలిటీల ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులకు మంగళవారం ఎన్నికలు నిర్వహించారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య తీవ్ర పోటీ నెలకొనగా, ఎక్స్-అఫీషియో ఓట్లు మరియు స్వతంత్ర అభ్యర్థుల మద్దతు ఈ ఎన్నికల్లో కీలకంగా మారాయి.

ఎన్నికలు జరిగిన మున్సిపాలిటీలు ఇవే:

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈరోజు కింది 11 మున్సిపాలిటీల్లో పరోక్ష ఎన్నికలు జరిగాయి:

ఇల్లెందు (భద్రాద్రి కొత్తగూడెం)
సుల్తానాబాద్ (పెద్దపల్లి)
ఇబ్రహీంపట్నం (రంగారెడ్డి)
కాగజ్‌నగర్ (కుమురం భీం ఆసిఫాబాద్)
క్యాతనపల్లి (మంచిర్యాల)
ఖానాపూర్ (నిర్మల్)
జహీరాబాద్ (సంగారెడ్డి)
ఇంద్రేశం (సంగారెడ్డి)
డోర్నకల్ (మహబూబాబాద్)
తొర్రూరు (మహబూబాబాద్)
జనగామ (జనగామ)

ఉత్కంఠ రేపిన ఫలితాలు

ఈ 11 మున్సిపాలిటీల్లో మెజారిటీ స్థానాలను దక్కించుకోవడానికి అధికార కాంగ్రెస్ పార్టీ తన వ్యూహాలను అమలు చేయగా, గతంలో పట్టున్న స్థానాలను నిలబెట్టుకోవడానికి బిఆర్ఎస్ గట్టి ప్రయత్నం చేసింది.

తొర్రూరు: ఇక్కడ కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఎక్స్-అఫీషియో సభ్యుల నమోదు విషయంలో వాగ్వాదం చోటుచేసుకుంది.

# అలసత్వం వహిస్తే స్పాట్‌లోనే సస్పెన్షన్

- మున్సిపల్ అధికారులపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం
- నేరుగా ఫీల్డ్‌లోకి రాకుంటే వేటు తప్పదు.. నేనే స్వయంగా జోన్లలో పర్యటిస్తా: అధికారులకు వార్నింగ్


2 లో

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (బిఎన్ఎస్ ):మున్సిపల్ అధికారుల పనితీరుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏసీ రూముల్లో కూర్చుని సమీక్షలు చేయడం కాదు.. ప్రజల సమస్యలు తీర్చాలంటే క్షేత్రస్థాయిలోకి వెళ్లాల్సిందేనని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖపై (MA&UD) సీఎం నిర్వహించిన సమీక్షా సమావేశం అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది. మున్సిపల్ కమిషనర్లు, జోనల్ కమిషనర్లు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, అవసరమైతే అక్కడికక్కడే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు.

# రాష్ట్రవ్యాప్తంగా గులాబీ జాతర


2 లో

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (BNS):తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు (కేసీఆర్) 72వ జన్మదిన వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా అంబరాన్నంటాయి. మంగళవారం తెల్లవారుజాము నుంచే తెలంగాణలోని పల్లెపల్లెనా, పట్టణాల్లోనూ కార్యకర్తలు, అభిమానులు కేసీఆర్ పుట్టినరోజును ఒక పండుగలా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదానాలు, రక్తదాన శిబిరాలతో రాష్ట్రం 'గులాబీ' వర్ణంగా మారింది.

తెలంగాణ భవన్‌లో సంబరాలు - కేటీఆర్ భావోద్వేగం

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కేసీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# సాగరతీరాన నౌకాదళ విన్యాసాల పండుగ

## : వైజాగ్ చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము


2 లో

# ముగిసిన 'ప్రత్యూష' కేసు మిస్టరీ

## - సుప్రీంకోర్టు కీలక తీర్పు

### సిద్ధార్థ రెడ్డికి జైలు శిక్ష ఖరారు.. నాలుగు వారాల్లో లొంగిపోవాలని ఆదేశం.. హత్య, అత్యాచారం ఆరోపణలు కొట్టివేత

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఫిబ్రవరి 17 (బిఎన్ఎస్ ): సుమారు 24 ఏళ్ల సుదీర్ఘ న్యాయ పోరాటం తర్వాత, తెలుగు నటి ప్రత్యూష మృతి కేసులో సుప్రీంకోర్టు నేడు తుది తీర్పును వెలువరించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు గుడిపల్లి సిద్ధార్థ రెడ్డికి 'ఆత్మహత్య ప్రేరణ' కింద విధించిన శిక్షను అత్యున్నత న్యాయస్థానం సమర్థించింది. నిందితుడు వచ్చే నాలుగు వారాల్లోగా పోలీసుల ఎదుట లొంగిపోవాలని జస్టిస్ రాజేష్ బిందాల్, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం సంచలన ఆదేశాలు జారీ చేసింది.

హత్య కాదు.. అది ఆత్మహత్యే!

ప్రత్యూష మరణం వెనుక హత్య కోణం ఉందంటూ ఆమె తల్లి సరోజినీ దేవి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ప్రత్యూషది హత్య అని, ఆమెపై అత్యాచారం జరిగిందన్న ఆరోపణలకు తగిన ఆధారాలు లేవని ధర్మాసనం స్పష్టం చేసింది.

మెడికల్ రిపోర్ట్స్: ఫోరెన్సిక్ మరియు వైద్య నివేదికల ప్రకారం ఆమె మరణానికి కారణం 'పాయిజనింగ్' (విషప్రయోగం) అని, గొంతు పిసికి చంపినట్లు ఎక్కడా రుజువు కాలేదని కోర్టు పేర్కొంది.


2 లో

# భారత్-ఫ్రాన్స్ 'మహా' బంధం మోదీ-మాక్రాన్ భేటీతో సరికొత్త చరిత్ర!


2 లో

# అల్లు అర్జున్‌కు 'క్షమాపణలు' చెప్పిన కావేరీ బారువా

## : 42 నిబంధనల వివాదానికి ముగింపు!


3 లో

# మండలిలో 'నెయ్యి' సెగ

## : టీడీపీ-వైసీపీ మధ్య యుద్ధం!


2 లో

అమరావతి, ఫిబ్రవరి 17 (బిఎన్ఎస్ ): ఆంధ్రప్రదేశ్ శాసనమండలి మంగళవారం రణరంగంగా మారింది. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడకంపై అధికార తెలుగుదేశం పార్టీ, ప్రతిపక్ష వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల మధ్య జరిగిన తీవ్ర వాగ్వాదం సభను కుదిపేసింది. ఇరుపక్షాలు ఒకరిపై ఒకరు ఆరోపణలు గుప్పించుకోవడంతో సభలో గందరగోళం నెలకొంది. వైసీపీ సభ్యులు ఏకంగా ఛైర్మన్ పోడియంను చుట్టుముట్టి నిరసన తెలపడంతో సభ పలుమార్లు వాయిదా పడింది.

# 'ఐబొమ్మ' రవికి బెయిల్

## ఇంటర్నెట్ వాడొద్దు.. విదేశాలకు వెళ్లొద్దు.. కోర్టు సంచలన షరతులు!



2 లో

# దేశంలో మళ్లీ 'ఎన్నికల' నగారా

## : ఐదు రాష్ట్రాల్లో ఏప్రిల్‌లో అసెంబ్లీ పోరు?



3 లో

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17 (బిఎన్ఎస్ ):దేశంలో మరో భారీ ఎన్నికల సంగ్రామానికి తెరలేవబోతోంది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి అసెంబ్లీల పదవీకాలం ఈ ఏడాది మే, జూన్ నెలల్లో ముగియనుంది. ఈ నేపథ్యంలో, ఏప్రిల్ నెలలో ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తోంది. ఇందుకు సంబంధించిన అధికారిక ఎన్నికల షెడ్యూల్‌ను మార్చి రెండో వారంలో లేదా మధ్యలో ప్రకటించే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

# శ్రీలక్ష్మికి సుప్రీంకోర్టులో చుక్కెదురు

## : ఊరట నిరాకరణ.. విచారణకు వెళ్లాల్సిందే!

న్యూఢిల్లీ/అమరావతి, ఫిబ్రవరి 17 (బిఎన్ఎస్ ):సీనియర్ ఐఏఎస్ అధికారిణి వై. శ్రీలక్ష్మికి అత్యున్నత న్యాయస్థానంలో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఓబులాపురం మైనింగ్ కంపెనీ కేసులో తనపై ఉన్న అభియోగాలను కొట్టివేయాలని ఆమె దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు, ఆమెకు ఎటువంటి ఉపశమనం ఇచ్చేందుకు నిరాకరించింది. తెలంగాణ హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పుపై స్టే ఇచ్చేందుకు నిరాకరిస్తూ, విచారణ ఎదుర్కోవాల్సిందేనని స్పష్టం చేసింది.

ఏమిటీ వివాదం?

గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గనుల శాఖ కార్యదర్శిగా పనిచేసిన సమయంలో, నిబంధనలకు విరుద్ధంగా ఓబులాపురం మైనింగ్ కంపెనీకి లబ్ధి చేకూర్చారనేది శ్రీలక్ష్మిపై ఉన్న ప్రధాన ఆరోపణ. ఈ కేసులో సీబీఐ ఆమెపై అభియోగ పత్రం దాఖలు చేసింది.


2 లో

# మున్సిపల్ పోరు ముగింపు

మొదటి పేజీ తరువాయి

ఇబ్రహీంపట్నం: కౌన్సిలర్ల చేరవేత, కిడ్నాప్ ఆరోపణల నేపథ్యంలో భారీ పోలీసు బందోబస్తు మధ్య ఎన్నిక నిర్వహించారు.

ఏకగ్రీవాలు: కొన్ని మున్సిపాలిటీల్లో స్పష్టమైన మెజారిటీ ఉండటంతో ఛైర్మన్ల ఎన్నిక ఏకగ్రీవంగా ముగిసింది.

రాజకీయ వ్యూహాలు – క్యాంపు రాజకీయాలు

మున్సిపల్ పీఠాలను కైవసం చేసుకునేందుకు రాజకీయ పార్టీలు గత రెండు రోజులుగా తమ కౌన్సిలర్లను రహస్య ప్రాంతాలకు తరలించి 'క్యాంపు' రాజకీయాలు నడిపాయి. ప్రత్యేకించి హంగ్ ఏర్పడిన చోట్ల స్వతంత్రుల మద్దతు పొందేందుకు అగ్రనేతలు రంగంలోకి దిగారు. అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో పట్టు కోసం ఎక్స్-అఫీషియో ఓట్లను జాగ్రత్తగా వినియోగించుకున్నారు.

శాంతిభద్రతలు – పోలీసు నిఘా

ఎన్నికల నేపథ్యంలో అన్ని మున్సిపల్ కార్యాలయాల వద్ద 144 సెక్షన్ విధించారు. అనవసర వ్యక్తులు లోపలికి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలకు సైతం ఆంక్షలు అమలులో ఉన్నాయి.

నేటితో రాష్ట్రంలోని 123 పట్టణ స్థానిక సంస్థలకు (7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలు) సంబంధించి పాలక వర్గాల ఏర్పాటు ప్రక్రియ దాదాపు పూర్తయింది. ఈ ఫలితాలు రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయో చూడాలి.

# అలసత్వం వహిస్తే స్పాట్‌లోనే సస్పెన్షన్

మొదటి పేజీ తరువాయి

శానిటేషన్‌పై సీరియస్: "రోడ్లు శుభ్రంగా లేకపోతే చర్యలు" ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ (+ఎవీజ) పరిధిలో పారిశుద్ధ్యం, రోడ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంపై ముఖ్యమంత్రి అసహనం వ్యక్తం చేశారు.

వార్నింగ్: "త్వరలోనే నేను వ్యక్తిగతంగా +ఎవీజలోని ప్రతి జోన్‌లో పర్యటిస్తా. ఆ సమయంలో ఎక్కడైనా రోడ్లు అపరిశుభ్రంగా ఉన్నా, చెత్త పేరుకుపోయి ఉన్నా బాధ్యులైన అధికారులను అక్కడికక్కడే సస్పెండ్ చేస్తా" అని సీఎం ఖరాకండిగా చెప్పారు.

క్షేత్రస్థాయి పర్యటనలు: కమిషనర్లు, జోనల్ కమిషనర్లు ప్రతిరోజూ ఉదయాన్నే ఫీల్డ్‌లోకి వెళ్లాలని, పారిశుధ్య పనులను స్వయంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. చాలా మంది అధికారులు ఫీల్డ్‌లోకి వెళ్లడం లేదని తన వద్ద సమాచారం ఉందని ఆయన పేర్కొన్నారు.

మున్సిపల్ ఆదాయంపై దృష్టి – 10 శాతం కేటాయింపు

ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండి పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

అడ్వర్టైజింగ్ బోర్డులు: నగరంలో అనధికార అడ్వర్టైజింగ్ బోర్డులను వెంటనే తొలగించాలని, అనుమతి ఉన్న బోర్డుల నుంచి ఏటా ఫీజులు వసూలు చేయాలని సూచించారు.

ప్రభుత్వ వాటా: మొత్తం అడ్వర్టైజింగ్ బోర్డులలో 10 శాతాన్ని ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారానికి కేటాయించాలని ఆదేశాలు జారీ చేశారు.

నగరంలో కొత్త ప్రాజెక్టులు & స్మార్ట్ పోల్స్

హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దే క్రమంలో పలు కీలక సూచనలు చేశారు:

స్కైవాక్స్: ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (ౠౠ) పద్ధతిలో స్కైవాక్ బ్రిడ్జిల ఏర్పాటుపై అధ్యయనం చేయాలని చెప్పారు.

మల్టీలెవల్ పార్కింగ్: నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో మల్టీలెవల్ కార్ పార్కింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు.

స్మార్ట్ పోల్స్: జంక్షన్‌ల వద్ద అత్యాధునిక స్మార్ట్ పోల్స్ ఏర్పాటు చేయాలని, వీధి దీపాల నిర్వహణలో యూనికోడ్ విధానం పాటించాలని సూచించారు.

కొత్త ప్రతినిధులకు శిక్షణ

ఇటీవలే 11 మున్సిపాలిటీలకు ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో.. కొత్తగా ఎన్నికైన మేయర్లు, డిప్యూటీ మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లకు పాలనపై అవగాహన కల్పించేందుకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సాగరతీరాన నౌకాదళ విన్యాసాల పండుగ

### : వైజాగ్ చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



విశాఖపట్నం, ఫిబ్రవరి 17 (బిఎన్ఎస్ ):సందడి నెలకొన్న విశాఖ సాగరతీరం మరిన్ని అరుదైన ఘట్టాలకు వేదిక కానుంది. భారత నౌకాదళం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ – 2026' కార్యక్రమంలో పాల్గొనేందుకు భారత రాష్ట్రపతి, 3 దళాల అధిపతి ద్రౌపది ముర్ము మంగళవారం సాయంత్రం విశాఖపట్నం చేరుకున్నారు. ప్రత్యేక విమానంలో ఐఎన్ఎస్ డేగాకు చేరుకున్న రాష్ట్రపతికి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మరియు నౌకాదళ ఉన్నతాధికారులు ఘనస్వాగతం పలికారు.

సముద్ర గర్భాన యుద్ధనౌకల కవాతు

బుధవారం ఉదయం విశాఖ సముద్ర తీరంలో జరిగే అత్యంత కీలకమైన 'ప్రెసిడెన్షియల్ ఫ్లీట్ రివ్యూ'లో రాష్ట్రపతి పాల్గొంటారు.

70కి పైగా యుద్ధనౌకలు: భారత నౌకాదళానికి చెందిన యుద్ధనౌకలతో పాటు దాదాపు 50 మిత్ర దేశాల నుంచి వచ్చిన 70కి పైగా నౌకలు, సబ్‌మెరైన్లు ఈ కవాతులో పాల్గొంటున్నాయి.

ఐఎన్ఎస్ విక్రాంత్ ప్రత్యేక ఆకర్షణ: స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన విమానవాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ ఈ వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. రాష్ట్రపతి దీని నుంచే సమీక్ష నిర్వహించనున్నారు.

వాయు విన్యాసాలు: సుమారు 50 రకాల యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు ఆకాశంలో విన్యాసాలు చేస్తూ రాష్ట్రపతికి వందనం సమర్పించనున్నాయి.

మిత్ర దేశాల ఐక్యతకు ప్రతీక

"సముద్రాల ద్వారా ఐక్యత – స్నేహ వారధుల బలోపేతం" అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ ×ఫీ=–2026, ప్రపంచ నౌకాదళాల మధ్య సమన్వయాన్ని పెంచేందుకు దోహదపడనుంది. దీనితో పాటు మల్టీలేటరల్ నేవల్ ఎక్సర్‌సైజ్ 'మిలాన్–2026' కూడా విశాఖలోనే జరుగుతోంది. సుమారు 100 దేశాల ప్రతినిధులు ఈ మహా వేడుకలో పాల్గొంటుండటం విశేషం.

విశాఖలో కట్టుదిట్టమైన భద్రత

రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో విశాఖ నగరంలో భారీ భద్రతను ఏర్పాటు చేశారు. సుమారు 7,000 మంది పోలీసులు, నిఘా డ్రోన్లతో గాలిలోనూ, నేలపైనా నిఘా కొనసాగుతోంది. నౌకాదళ కేంద్రంలో ఏర్పాటు చేసిన 'ప్రెసిడెన్షియల్ బ్యాంకెట్' (విందు) లో రాష్ట్రపతి పాల్గొంటారు. భారత నౌకాదళ శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి చాటిచెప్పే ఈ చారిత్రాత్మక ఘట్టం కోసం నగరం మొత్తం విద్యుత్ కాంతులతో ముస్తాబైంది.

# ముగిసిన 'ప్రత్యూష' కేసు మిస్టరీ - సుప్రీంకోర్టు కీలక తీర్పు

మొదటి పేజీ తరువాయి

లేట్ అలిగేషన్స్: దశాబ్దాల తర్వాత అత్యాచారం వంటి ఆరోపణలు చేయడం చెల్లదని, క్షేత్రస్థాయి ఆధారాలు ఆత్మహత్య ఒప్పందాన్ని సూచిస్తున్నాయని వెల్లడించింది.

శిక్ష ఖరారు – లొంగుబాటుకు గడువు

నిందితుడు సిద్ధార్థ రెడ్డి దాఖలు చేసిన బెయిల్ మరియు శిక్ష రద్దు పిటిషన్లను కోర్టు తోసిపుచ్చింది.

శిక్ష వివరాలు: గతంలో సెషన్స్ కోర్టు అతనికి ఐదేళ్ల జైలు శిక్ష విధించగా, 2011లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు దాన్ని రెండేళ్లకు కుదించింది.

సుప్రీం ఆదేశం: హైకోర్టు విధించిన శిక్షను సమర్థిస్తూనే, నిందితుడు తక్షణమే లొంగిపోవాలని ఆదేశించింది. అప్పట్లో సిద్ధార్థ రెడ్డి కొంతకాలం జైలులో గడిపినందున, మిగిలిన శిక్షా కాలాన్ని ఇప్పుడు అనుభవించాల్సి ఉంటుంది.

కేసు నేపథ్యం ఏమిటి?

2002, ఫిబ్రవరి 23న అప్పటి వర్ధమాన నటి ప్రత్యూష మరియు ఆమె స్నేహితుడు సిద్ధార్థ రెడ్డి ప్రేమ వ్యవహారంలో పెద్దలు అంగీకరించలేదన్న కారణంతో కూల్ డ్రింక్ లో పురుగుల మందు కలుపుకుని ఆత్మహత్యకు ప్రయత్నించారు. చికిత్స పొందుతూ ప్రత్యూష మరణించగా, సిద్ధార్థ రెడ్డి కోలుకున్నారు. అయితే ఆమె తల్లి మాత్రం ఇది ముమ్మాటికీ హత్యేనని, సినీ, రాజకీయ ప్రముఖుల హస్తం ఉందని పోరాటం సాగించారు.

24 ఏళ్ల నిరీక్షణకు తెర

నేటి తీర్పుతో 2002లో మొదలైన ఈ మిస్టరీ కేసు ఒక కొలిక్కి వచ్చినట్లయింది. తీర్పు వెలువడిన అనంతరం ప్రత్యూష తల్లి సరోజినీ దేవి స్పందిస్తూ.. తన కుమార్తెకు సంపూర్ణ న్యాయం జరగలేదని, నిందితుడికి హత్య కేసులో శిక్ష పడాల్సిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ఈ తీర్పుతో టాలీవుడ్‌లో దశాబ్ద కాలంగా నెలకొన్న ఒక భారీ మిస్టరీపై తెరపడింది.

# రాష్ట్రవ్యాప్తంగా గులాబీ జాతర

మొదటి పేజీ తరువాయి



"కేసీఆర్ జాతిపిత అని మేమెప్పుడూ అనలేదు"

కాంగ్రెస్ నేతలు చేస్తున్న విమర్శలపై కేటీఆర్ ఘాటుగా స్పందించారు. "కేసీఆర్ గారిని మేమెప్పుడూ 'జాతిపిత' అని సంబోధించలేదు. జాతిపిత అంటే మహాత్మా గాంధీ గారే. కానీ, కేసీఆర్ గారు మా పాలిట 'తెలంగాణ జాతి ప్రదాత'. ఈ గడ్డపై ప్రతి ఇంటికీ ఆయన ఏదో ఒక రూపంలో మేలు చేశారు. అందుకే ఆయన మా గుండెల్లో దేవుడు. ప్రజలు ఆయనను ఇంటి పెద్దగా చూసుకుంటున్నారు. దాన్ని రాజకీయ రంగు పూయడం తగదు" అని కేటీఆర్ స్పష్టం చేశారు.

తెలంగాణ పునర్నిర్మాత: 60 ఏళ్ల కలను నిజం చేసిన ధీశాలి కేసీఆర్ అని, తెలంగాణ చరిత్ర ఉన్నంత కాలం ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని కేటీఆర్ కొనియాడారు.

సేవా కార్యక్రమాలు: పుట్టినరోజు సందర్భంగా ఎక్కడా ఆడంబరాలకు పోకుండా, పేదలకు సాయం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది చోట్ల పండ్లు, దుప్పట్ల పంపిణీ జరిగింది.

ఎర్రవల్లిలో సందడి: గజ్వేల్ నియోజకవర్గంలోని ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వద్దకు భారీగా తరలివచ్చిన నేతలు, కార్యకర్తలు కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రముఖుల శుభాకాంక్షల వెల్లువ

ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేసీఆర్‌కు సోషల్ మీడియా వేదికగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.

# మండలిలో 'నెయ్యి' సెగ: టీడీపీ-వైసీపీ మధ్య యుద్ధం!

మొదటి పేజీ తరువాయి

వివాదం ఎక్కడ మొదలైంది?

ప్రశ్నోత్తరాల సమయంలో కల్తీ నెయ్యి అంశం చర్చకు వచ్చింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే తిరుమల పవిత్రత దెబ్బతిందని, లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిన నెయ్యి వాడారని టీడీపీ సభ్యులు ఆరోపించారు. దీనిపై విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దీనికి ప్రతిగా వైసీపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. కూటమి ప్రభుత్వం కేవలం రాజకీయ లబ్ధి కోసమే భక్తుల మనోభావాలతో ఆడుకుంటోందని మండిపడ్డారు.

పోడియం ముట్టడి – ప్లకార్డుల ప్రదర్శన

టీడీపీ సభ్యుల విమర్శలతో ఆగ్రహించిన వైసీపీ సభ్యులు ఒక్కసారిగా నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు.

ముట్టడి: వైసీపీ సభ్యులు ఛైర్మన్ పోడియంను చుట్టుముట్టి, సభ నిర్వహణకు ఆటంకం కలిగించారు.

నినాదాలు: "డైవర్షన్ పాలిటిక్స్ ఆపాలి", "గోవిందా.. గోవిందా" అంటూ నినాదాలు చేస్తూ సభను హోరెత్తించారు.

ప్లకార్డులు: తమ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రభుత్వం సమాధానం చెప్పాలని పట్టుబట్టారు.

మంత్రుల కౌంటర్ – సభ వాయిదా

ఈ క్రమంలో మంత్రులు జోక్యం చేసుకుంటూ.. తప్పు చేసిన వారు శిక్ష అనుభవించాల్సిందేనని, ల్యాబ్ రిపోర్టులే నిజాలను చెబుతున్నాయని కౌంటర్ ఇచ్చారు. వైసీపీ సభ్యులు ఎంత చెప్పినా వినకుండా రభస చేయడంతో మండలి ఛైర్మన్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సభ్యులు తమ స్థానాల్లోకి వెళ్లాలని కోరినా వినకపోవడంతో సభను తాత్కాలికంగా వాయిదా వేశారు.

ప్రజా సమస్యలు పక్కకు..

రాష్ట్రంలో నెలకొన్న ఇతర ముఖ్యమైన సమస్యలపై చర్చ జరగాల్సిన సమయంలో, కేవలం నెయ్యి వివాదం చుట్టూనే సభ తిరగడంపై సామాన్య జనం పెదవి విరుస్తున్నారు. విచారణ కమిటీ రిపోర్టు వచ్చే వరకు వేచి చూడకుండా ఉభయ పక్షాలు సభను స్తంభింపజేయడం గమనార్హం.

# శ్రీలక్ష్మికి సుప్రీంకోర్టులో చుక్కెదురు

మొదటి పేజీ తరువాయి

హైకోర్టు చుక్కెదురు: ఈ కేసు నుంచి తన పేరును తొలగించాలని ఆమె దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు ఇప్పటికే కొట్టివేసింది. ట్రయల్ కోర్టులో విచారణను ఎదుర్కోవాలని ఆదేశించింది.

సుప్రీం ఆశ్రయం: హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ శ్రీలక్ష్మి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన విధుల్లో భాగంగానే నిర్ణయాలు తీసుకున్నానని, తనపై క్రిమినల్ చర్యలు చెల్లవని ఆమె వాదించారు.

సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యలు

నేడు ఈ పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనం, సీబీఐ వాదనలతో ఏకీభవించింది. "ఈ దశలో స్టే ఇవ్వడం సాధ్యం కాదు. కేసు తీవ్రత దృష్ట్యా విచారణ జరగాల్సిందే" అని పేర్కొంది. తదుపరి విచారణను వాయిదా వేస్తూనే, ప్రస్తుతం జరుగుతున్న విచారణ ప్రక్రియకు ఆటంకం కలిగించలేమని స్పష్టం చేసింది.

మరింత ఇబ్బందుల్లో శ్రీలక్ష్మి?

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ కేడర్‌లో పనిచేస్తున్న శ్రీలక్ష్మికి, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటికే ప్రాధాన్యత లేని పోస్టులో (జీఏడీలో రిపోర్ట్ చేయాలని) ఉంచారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆమె అత్యంత కీలక బాధ్యతలు నిర్వహించారు. ఇప్పుడు కోర్టులో కూడా చుక్కెదురు కావడంతో ఆమె చుట్టూ ఉచ్చు బిగుసుకున్నట్లయింది. ట్రయల్ కోర్టులో విచారణ వేగవంతం అయితే ఆమె మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావచ్చు.

# 'ఐబొమ్మ' రవికి బెయిల్

## ఇంటర్నెట్ వాడొద్దు.. విదేశాలకు వెళ్లొద్దు.. కోర్టు సంచలన షరతులు!



హైదరాబాద్, ఫిబ్రవరి 17 (బిఎన్ఎస్ ) :టాలీవుడ్‌తో పాటు భారతీయ సినీ పరిశ్రమను పైరసీతో కుదిపేసిన 'ఐబొమ్మ' వెబ్‌సైట్ సూత్రధారి ఇమ్మడి రవి అలియాస్ ఐబొమ్మ రవికి తెలంగాణ హైకోర్టు మంగళవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. గత ఏడాది నవంబర్ 16న సైబర్ క్రైమ్ పోలీసులకు చిక్కిన రవి, సుమారు మూడు నెలల జైలు జీవితం తర్వాత ఎట్టకేలకు ఉపశమనం పొందారు. అయితే, ఆయనకు బెయిల్ ఇచ్చే క్రమంలో కోర్టు విధించిన ఆంక్షలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

కోర్టు విధించిన కఠిన షరతులు ఇవే:

రవి బయటకు వచ్చినప్పటికీ, అతను మళ్లీ పైరసీకి పాల్పడకుండా ఉండేందుకు న్యాయస్థానం అత్యంత అరుదైన నిబంధనలను విధించింది:

ఇంటర్నెట్ వాడకంపై నిషేధం: రవి ఎలాంటి ఇంటర్నెట్ సౌకర్యాన్ని సొంతంగా వాడకూడదని కోర్టు స్పష్టం చేసింది. ఒకవేళ అత్యవసర పరిస్థితుల్లో నెట్ వాడాల్సి వస్తే పోలీసుల ముందస్తు అనుమతి తప్పనిసరి.

పాస్‌పోర్ట్ సరెండర్: నిందితుడు దేశం విడిచి వెళ్లకుండా తన పాస్‌పోర్టును వెంటనే కోర్టులో డిపాజిట్ చేయాలని ఆదేశించింది.

పోలీసుల ఎదుట హాజరు: ప్రతిరోజూ ఉదయం 11 గంటలకు హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (జజూ) అధికారుల ముందు హాజరై సంతకం చేయాల్సి ఉంటుంది.

సాక్ష్యాల తారుమారు: కేసు విచారణలో ఉన్నందున సాక్ష్యాలను ప్రభావితం చేసే ప్రయత్నం చేయకూడదని హెచ్చరించింది.

కేసు నేపథ్యం ఏమిటి?

తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైబర్ క్రైమ్ పోలీసులు రవిపై ఐదు కేసులు నమోదు చేశారు. కొత్త సినిమాలు విడుదలైన కొన్ని గంటల్లోనే హెచ్‌డీ ప్రింట్లను 'ఐబొమ్మ'లో అప్‌లోడ్ చేస్తూ నిర్మాతలకు సుమారురూ .24,000 కోట్ల నష్టం కలిగించారనేది ప్రధాన ఆరోపణ. కేవలం పైరసీయే కాకుండా, బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేయడం ద్వారా కోట్లాది రూపాయలు ఆర్జించినట్లు దర్యాప్తులో తేలింది.

పోలీసుల వేట.. విదేశీ పౌరసత్వం

విశాఖపట్నంకు చెందిన రవి, కరేబియన్ దీవుల పౌరసత్వం పొంది విదేశాల నుంచి ఈ నెట్‌వర్క్ నడిపేవారు. ఫ్రాన్స్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన సమయంలో పోలీసులు వ్యూహాత్మకంగా అతడిని అదుపులోకి తీసుకున్నారు. రవికి చెందిన అంతర్జాతీయ బ్యాంక్ ఖాతాల్లోని సుమారు ౩ే కోట్లను ఇప్పటికే పోలీసులు ఫ్రీజ్ చేశారు.

సినిమా ఇండస్ట్రీని పీడిస్తున్న పైరసీ భూతాన్ని అరికట్టే క్రమంలో రవి అరెస్ట్ ఒక కీలక మలుపు. ఇప్పుడు బెయిల్ లభించినప్పటికీ, కోర్టు విధించిన 'డిజిటల్ ఆంక్షలు' నిందితుడి కదలికలను పూర్తిగా అదుపులో ఉంచనున్నాయి.

# భారత్-ఫ్రాన్స్ 'మహా' బంధం: మోదీ-మాక్రాన్ భేటీతో సరికొత్త చరిత్ర!



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17 (బిఎన్ఎస్ ):ప్రపంచ రాజకీయాల్లో వ్యూహాత్మక భాగస్వాములుగా ఉన్న భారత్–ఫ్రాన్స్ దేశాల మధ్య మైత్రి మరో శిఖరానికి చేరింది. అధికారిక పర్యటన నిమిత్తం భారత్ వచ్చిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. ఇరు దేశాల అధినేతల మధ్య జరిగిన ఈ ఉన్నత స్థాయి సమావేశంలో రక్షణ, సాంకేతికత, మరియు పర్యావరణ రంగాలకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

హైదరాబాద్ హౌస్‌లో ఆత్మీయ ఆలింగనం

ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని మోదీ, అధ్యక్షుడు మాక్రాన్‌కు ఆత్మీయంగా స్వాగతం పలికారు. ఇద్దరు నేతలు ఏకాంతంగా చర్చలు జరిపిన అనంతరం ప్రతినిధుల స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. "ఫ్రాన్స్ భారత్‌కు అత్యంత నమ్మకమైన మిత్రదేశం. మాక్రాన్ పర్యటన మా ద్వైపాక్షిక సంబంధాల్లో ఒక కొత్త అధ్యాయాన్ని లిఖిస్తుంది" అని మోదీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

కీలక ఒప్పందాల ముఖ్యాంశాలు:

రక్షణ రంగం : 'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా ఫ్రాన్స్‌కు చెందిన రక్షణ దిగ్గజాలు భారత్‌లోనే హెలికాప్టర్లు, సబ్‌మెరైన్ ఇంజన్ల తయారీని చేపట్టేందుకు అంగీకారం కుదిరింది. స్కార్పీన్ తరగతి జలాంతర్గాముల నిర్మాణానికి అదనపు వేగాన్నివ్వాలని నిర్ణయించారు.

అంతరిక్ష పరిశోధనలు: ఇస్రో మరియు ఫ్రాన్స్‌కు చెందిన సీఎన్ఈఎస్ కలిసి సంయుక్తంగా ఉపగ్రహ ప్రయోగాలను చేపట్టడంపై ఒప్పందం కుదుర్చుకున్నాయి.

యువతకు అవకాశాలు: భారతీయ విద్యార్థులకు ఫ్రాన్స్‌లో ఉన్నత విద్య మరియు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేలా 'మొబిలిటీ పార్ట్‌నర్‌షిప్'పై ఇద్దరు నేతలు సంతకాలు చేశారు.

గ్రీన్ హైడ్రోజన్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో సహకారం పెంచుకోవాలని నిర్ణయించారు.

రోడ్ షో మరియు సాంస్కృతిక సందడి

అంతకుముందు, ఇద్దరు నేతలు కలిసి నిర్వహించిన రోడ్ షోలో ప్రజలు నీరాజనాలు పట్టారు. స్థానిక కళాకారుల ప్రదర్శనలు మాక్రాన్‌ను విశేషంగా ఆకట్టుకున్నాయి. రోడ్డు పక్కన ఉన్న ఒక దుకాణం వద్ద ప్రధాని మోదీతో కలిసి మాక్రాన్ 'టీ' తాగి సందడి చేశారు. ఆ సమయంలో మోదీ యూపీఐ ద్వారా పేమెంట్ చేయడం చూసి మాక్రాన్ ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ భారత డిజిటల్ విప్లవాన్ని అభినందించారు.

జైపూర్ నుంచి ఢిల్లీ వరకు..

గతేడాది రిపబ్లిక్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా వచ్చిన మాక్రాన్, మళ్ళీ ఇప్పుడు భారత్‌లో పర్యటించడం ఇరు దేశాల మధ్య ఉన్న గాఢమైన బంధానికి నిదర్శనమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ భేటీ ద్వారా ఇండో–పసిఫిక్ ప్రాంతంలో శాంతి, భద్రతల స్థాపనలో భారత్–ఫ్రాన్స్ కీలక పాత్ర పోషించనున్నాయి.

# కొల్లూరు భూముల వివాదం

## అసలైన యజమానులెవరు? 1984 విభజన చట్టబద్ధతపై స్పష్టత

హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో వేగంగా విస్తరిస్తున్న పట్టణాభివృద్ధి మధ్య భూముల విలువలు ఆకాశాన్నంటుతున్నాయి. అదే సమయంలో పాత రికార్డులు, వారసత్వ హక్కులు, ప్రభుత్వ నోటీసులు, మధ్యవర్తుల ఒప్పందాలు వంటి అంశాలు అనేక ప్రాంతాల్లో వివాదాలకు దారి తీస్తున్నాయి. అలాంటి అత్యంత చర్చనీయాంశమైన కేసుల్లో ఒకటిగా నిలిచింది కొల్లూరు ప్రాంత భూముల వ్యవహారం.

ఈ వివాదంలో ప్రధానంగా నిలుస్తున్న అంశం 1984లో జరిగిన ప్లాట్ల విభజన చట్టబద్ధమేనా?

చట్టపరమైన విశ్లేషణలు, పాత పత్రాలు, రిజిస్ట్రేషన్ వివరాలు పరిశీలిస్తే ఆ విభజన చట్టబద్ధమైనదే అనే వాదన బలంగా వినిపిస్తోంది. అదే కోణంలో పరిశీలిస్తే ఇప్పటి వరకు ప్లాట్లు కొనుగోలు చేసినవారే అసలైన యజమానులని స్పష్టత వస్తోంది.

1984 విభజన ఎలా జరిగింది?

1980ల కాలంలో ఈ ప్రాంతం పూర్తిగా వ్యవసాయ భూమిగా ఉండేది. పట్టణ విస్తరణ భవిష్యత్తులో వస్తుందని భావించిన భూస్వాములు తమ భూములను నివాస ప్లాట్లుగా మార్చాలని నిర్ణయించారు.

కుటుంబ సభ్యుల మధ్య హక్కుల స్పష్టత తీసుకొచ్చారు

చట్టబద్ధంగా పంచాయితీ/రెవెన్యూ రికార్డుల్లో విభజన నమోదైంది

తర్వాత లేఅవుట్ రూపంలో ప్లాట్లుగా విభజించారు

కొనుగోలుదారులకు రిజిస్టర్డ్ డాక్యుమెంట్ల ద్వారా విక్రయించారు

ఈ ప్రక్రియలో జరిగిన ముఖ్యమైన విషయం ఏమిటంటే భూమి ముందుగా చట్టబద్ధంగా భాగాలుగా విడిపోయింది; తర్వాతే అమ్మకం జరిగింది.

అంటే అమ్మకం జరిగిన తేదీ కంటే ముందే యాజమాన్య హక్కులు స్పష్టంగా నిర్ణయించబడ్డాయి.




కొనుగోలు చేసినవారే యజమానులని ఎందుకు అంటున్నారు?

చట్టం ప్రకారం యాజమాన్యాన్ని నిర్ణయించడంలో ప్రధానంగా మూడు అంశాలు కీలకం:

1. మూల హక్కు (Root Title)

1984లో విభజన జరిగిన తర్వాత ప్రతి భాగానికి వేర్వేరు హక్కులు ఏర్పడ్డాయి.

అంటే ఆ తరువాత అమ్మిన వ్యక్తి తన భాగాన్నే విక్రయించాడు ఇతరుల హక్కులను కాదు.

2. రిజిస్ట్రేషన్ ఆధారాలు

కొనుగోలు చేసినవారికి:

రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు

పన్నుల చెల్లింపులు

వారసత్వ బదిలీలు

విద్యుత్, మున్సిపల్ కనెక్షన్లు లాంటివి దశాబ్దాలుగా కొనసాగుతున్నాయి.

ఇవి యాజమాన్యాన్ని బలపరిచే ద్వితీయ ఆధారాలుగా చట్టం గుర్తిస్తుంది.

3. దీర్ఘకాల అనుభవ హక్కు (Possession + Enjoyment)

కొనుగోలుదారులు:

ఇళ్ల నిర్మాణం

నివాసం

పన్నుల చెల్లింపు

చేసుకుంటూ 3040 సంవత్సరాలుగా ఆస్తిని వినియోగిస్తున్నారు.

ఇలాంటి సందర్భాల్లో చట్టం "దీర్ఘకాల అనుభవ హక్కు"ను కూడా పరిగణనలోకి తీసుకుంటుంది.

వివాదం ఎందుకు వచ్చింది?

కాలక్రమేణా భూముల విలువలు భారీగా పెరగడంతో పాత రికార్డులపై కొత్త అభ్యంతరాలు లేవనెత్తబడ్డాయి.

కొన్ని వర్గాలు:

అసలు విభజన సరైనది కాదని

అమ్మకాలు చెల్లవని

తిరిగి హక్కులు వస్తాయని

వాదనలు ప్రారంభించాయి.

కానీ ఇక్కడ ప్రధాన ప్రశ్న

విభజన చట్టబద్ధమైతే తర్వాత జరిగిన అమ్మకాలన్నీ కూడా చట్టబద్ధమే అవుతాయి.

చట్టపరమైన కోణం

భూమి వ్యవహారాల్లో కోర్టులు సాధారణంగా ఈ సూత్రాన్ని అనుసరిస్తాయి:

"మూల విభజన చెల్లుబాటు అయితే, దాని ఆధారంగా జరిగిన తదుపరి రిజిస్ట్రేషన్లు కూడా చెల్లుబాటు అవుతాయి."

1984లో విభజన సరైనదిగా నిలిస్తే:

కొనుగోలుదారులు చట్టబద్ధ యజమానులు

తరువాతి అభ్యంతరాలు బలహీనమవుతాయి

దీర్ఘకాల స్వాధీన హక్కు మరింత బలపడుతుంది

ప్లాట్ యజమానుల వాదన

ప్లాట్ కొనుగోలు దారులు చెబుతున్నది సారాంశంగా ఇలా ఉంది:

మేము రిజిస్ట్రేషన్ ఆధారంగా కొనుగోలు చేశాం

దశాబ్దాలుగా పన్నులు చెల్లిస్తున్నాం

ప్రభుత్వ సేవలు పొందుతున్నాం

ఇళ్లు నిర్మించుకున్నాం

అందువల్ల

మేమే చట్టబద్ధ యజమానులం మాకు రక్షణ కావాలి అని వారు కోరుతున్నారు.

సామాజిక ప్రభావం

ఈ కేసు కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాదు.

ఇది ఒక పెద్ద సూత్రాన్ని నిర్ధారిస్తుంది:

పాత రిజిస్ట్రేషన్ల భద్రత

ప్రజల పెట్టుబడుల రక్షణ

పట్టణాభివృద్ధిపై నమ్మకం

వందల కుటుంబాల భవిష్యత్తు ఈ నిర్ణయంపై ఆధారపడి ఉంది.

తుది విశ్లేషణ

లభ్యమైన పత్రాలు, చరిత్ర, రిజిస్ట్రేషన్ ప్రక్రియల ఆధారంగా కనిపిస్తున్న ప్రధాన విషయం:

1984లో జరిగిన ప్లాట్ల విభజన చట్టబద్ధమైనదిగా పరిగణిస్తే

ఆ ప్లాట్లను కొనుగోలు చేసిన వారే అసలైన యజమానులు అవుతారు.

అందువల్ల వివాద పరిష్కారంలో కీలక అంశం ఒకటే

మూల విభజన చెల్లుబాటు నిర్ధారణ.

అది స్పష్టమైతే ఈ వివాదం పెద్ద మొత్తంలో ముగిసే అవకాశం ఉందని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

సారాంశం:

కొల్లూరు భూముల వ్యవహారం కేవలం భూమి వివాదం కాదు;

పాత రిజిస్ట్రేషన్ వ్యవస్థపై ప్రజల విశ్వాసానికి సంబంధించిన పరీక్షగా మారింది.

విభజన చట్టబద్ధతే అసలైన యాజమాన్యాన్ని నిర్ణయించే తాళం చెవి.

---

## అల్లు అర్జున్‌కు 'క్షమాపణలు' చెప్పిన కావేరీ బారువా: 42 నిబంధనల వివాదానికి ముగింపు!



హైదరాబాద్, ఫిబ్రవరి 17 (బిఎన్ఎస్ ): టాలీవుడ్ స్టార్ హీరో అల్లు అర్జున్ వ్యక్తిత్వంపై గత కొద్ది రోజులుగా సామాజిక మాధ్యమాల్లో సాగుతున్న ప్రచారానికి తెరపడింది. బన్నీని కలవాలంటే '42 నిబంధనలు' (Dos and Don»ts) పాటించాలంటూ సంచలన వ్యాఖ్యలు చేసిన రాయల్ ఎన్‌ఫీల్డ్ మాజీ బ్రాండ్ స్ట్రాటజిస్ట్ కావేరీ బారువా ఎట్టకేలకు తన తప్పును అంగీకరించారు. తాను చేసిన వ్యాఖ్యలు నిరాధారమైనవని పేర్కొంటూ ఆమె మంగళవారం ఒక సుదీర్ఘ క్షమాపణ లేఖను విడుదల చేశారు.

వివాదం నేపథ్యం ఏమిటి?

ఇటీవల ఒక పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న కావేరీ బారువా మాట్లాడుతూ.. అల్లు అర్జున్‌తో ఒక యాడ్ షూటింగ్ సందర్భంగా ఆయన టీమ్ తనకు 42 నిబంధనలతో కూడిన ఒక జాబితాను ఇచ్చిందని ఆరోపించారు. అందులో "హీరో కళ్లలోకి నేరుగా చూడకూడదు, ఆయనకు షేక్ హ్యాండ్ ఇవ్వకూడదు" వంటి వింత నిబంధనలు ఉన్నాయని ఆమె చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో దావానంలా వ్యాపించాయి. దీంతో బన్నీ అభిమానులు, నెటిజన్ల నుంచి ఆమెపై తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తమయ్యాయి.

కావేరీ బారువా క్షమాపణలో ఏముంది?

వివాదం ముదరడం, అల్లు అర్జున్ టీమ్ చట్టపరమైన చర్యలకు సిద్ధమవడంతో కావేరి వెనక్కి తగ్గారు. ఆమె తన క్షమాపణలో ప్రధానంగా ఈ అంశాలను ప్రస్తావించారు:

ఆధారాలు లేవు: "అల్లు అర్జున్ గారిని కలవడానికి 42 నిబంధనలు ఉన్నాయన్న దానికి నా దగ్గర ఎలాంటి రాతపూర్వక ఆధారాలు లేవు. ఆయన టీమ్ నుంచి నాకు అలాంటి డాక్యుమెంట్ ఏదీ రాలేదు."

ఫ్లోలో వచ్చిన మాటలు: "సంభాషణలో భాగంగా మాటల ఫ్లోలో ఆ వ్యాఖ్యలు చేశాను తప్ప, అవి వాస్తవాలు కావు. నా మాటల వల్ల అల్లు అర్జున్ గారి ప్రతిష్టకు భంగం కలిగితే క్షమించండి."

గౌరవం ఉంది: "అల్లు అర్జున్ గారంటే నాకు ఎంతో గౌరవం. నేను చేసిన వ్యాఖ్యలను పూర్తిస్థాయిలో ఉపసంహరించుకుంటున్నాను."

వీడియోల తొలగింపు

కావేరీతో పాడ్‌కాస్ట్ నిర్వహించిన నిర్వాహకులు కూడా స్పందించారు. అల్లు అర్జున్‌కు వ్యతిరేకంగా ఉన్న ఆ వీడియో క్లిప్పింగ్‌లను, పూర్తి ఎపిసోడ్‌ను అన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్స్ నుండి తొలగించినట్లు ప్రకటించారు. తమకు ఎవరినీ కించపరిచే ఉద్దేశ్యం లేదని వివరణ ఇచ్చారు.

స్పందించిన అల్లు అర్జున్ టీమ్

మొదటి నుంచీ ఈ ఆరోపణలను బన్నీ టీమ్ ఖండిస్తూనే ఉంది. "అల్లు అర్జున్ ఎప్పుడూ గౌరవప్రదంగానే మెలుగుతారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు" అని స్పష్టం చేసింది. కావేరి క్షమాపణ చెప్పడంతో ఈ వివాదం ఇక్కడితో సర్దుమణిగినట్లయింది.

---

## దేశంలో మళ్లీ 'ఎన్నికల' నగారా




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17 (బిఎన్ఎస్ ):దేశంలో మరో భారీ ఎన్నికల సంగ్రామానికి తెరలేవబోతోంది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి అసెంబ్లీల పదవీకాలం ఈ ఏడాది మే, జూన్ నెలల్లో ముగియనుంది. ఈ నేపథ్యంలో, ఏప్రిల్ నెలలో ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తోంది. ఇందుకు సంబంధించిన అధికారిక ఎన్నికల షెడ్యూల్‌ను మార్చి రెండో వారంలో లేదా మధ్యలో ప్రకటించే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

రాష్ట్రాల వారీగా అసెంబ్లీ గడువు వివరాలు:

ఎన్నికల సంఘం గణాంకాల ప్రకారం, ఆయా రాష్ట్రాల అసెంబ్లీల గడువు కింది తేదీలతో ముగియనుంది:

పశ్చిమ బెంగాల్: మే 7, 2026

తమిళనాడు: మే 10, 2026

అస్సాం: మే 20, 2026

కేరళ: మే 23, 2026

పుదుచ్చేరి: జూన్ 15, 2026

క్షేత్రస్థాయిలో ఈసీ తనిఖీలు

ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఈసీ అధికారులు ఇప్పటికే ఆయా రాష్ట్రాల్లో పర్యటనలు ప్రారంభించారు. ప్రస్తుతం ఎన్నికల సంఘం బృందం అస్సాంలో పర్యటిస్తూ భద్రత, పోలింగ్ కేంద్రాల సదుపాయాలను సమీక్షిస్తోంది. త్వరలోనే బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లోనూ పర్యటించనుంది. నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా, ఒకే చోట మూడేళ్లకు పైగా పనిచేస్తున్న అధికారులను ఫిబ్రవరి 27లోగా బదిలీ చేయాలని ఈసీ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది.

ఓటర్ల జాబితా విడుదల

ఎన్నికలకు ముందు కీలకమైన ఓటర్ల తుది జాబితా ప్రచురణ ప్రక్రియ తుది దశకు చేరుకుంది:

తమిళనాడు: ఫిబ్రవరి 17 తుది జాబితా విడుదల

కేరళ: ఫిబ్రవరి 21న ఓటర్ల జాబితా వెలువడనుంది.

పశ్చిమ బెంగాల్: ఫిబ్రవరి 28న ఓటర్ల జాబితా ప్రచురితం కానుంది.

రాజకీయ సమీకరణలు

ఈ ఎన్నికలు ప్రధాన పార్టీలకు జీవన్మరణ సమస్యగా మారాయి.

పశ్చిమ బెంగాల్: తృణమూల్ కాంగ్రెస్ తన పట్టు నిలుపుకోవాలని చూస్తుండగా, బీజేపీ గట్టి పోటీ ఇచ్చేందుకు వ్యూహాలు రచిస్తోంది.

తమిళనాడు: అధికార డీఎంకే మరియు ప్రతిపక్ష ఏఐఏడీఎంకే మధ్య హోరాహోరీ పోరు నెలకొంది. ఇటీవల బడ్జెట్‌లో తమిళనాడుకు కేంద్రం భారీ కేటాయింపులు చేయడంపై రాజకీయ చర్చ మొదలైంది.

కేరళ: అధికార ఎల్‌డీఎఫ్ తన వరుస విజయాన్ని కొనసాగించాలని భావిస్తుండగా, కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ పుంజుకోవాలని చూస్తోంది.

అన్ని రాష్ట్రాల్లోనూ ఒకేసారి షెడ్యూల్ విడుదల చేసినప్పటికీ, శాంతిభద్రతల దృష్ట్యా పశ్చిమ బెంగాల్‌లో గతంలో లాగే బహుళ దశల్లో పోలింగ్ జరిగే అవకాశం ఉంది. తమిళనాడు, కేరళలో మాత్రం సింగిల్ ఫేజ్‌లో ఎన్నికలు నిర్వహించే ఛాన్స్ ఉంది.

---

## కల్వకుంట్ల చంద్రశేఖర రావు

## 72వ జన్మదినం

### శేరిలింగంపల్లిలో 72 అడుగుల భారీ చిత్రం ఆవిష్కరణ



శేరిలింగంపల్లి, (బి.ఎన్.స్ ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు (కేసీఆర్) 72వ జన్మదిన వేడుకలు శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మారబోయిన రవి యాదవ్ నాయకత్వంలో మస్జిద్ బండ కట్ట మైసమ్మ వద్ద ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసి వేడుకలు జరిపారు.

ఈ సందర్భంగా మైదానంలోని పచ్చిక గడ్డపై భారీ 72 అడుగుల కేసీఆర్ చిత్రాన్ని ప్రతిష్మాత్మకంగా ఆవిష్కరించారు. భారీ చిత్రావిష్కరణతో సభా ప్రాంగణం జై తెలంగాణ నినాదాలతో మార్మోగింది. కార్యకర్తల్లో ఉత్సాహం ఉప్పొంగింది.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కేక్ కట్ చేసి కేసీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్ దీర్ఘాయుష్షుతో ఆరోగ్యంగా ఉండి తెలంగాణ ప్రజలకు మార్గదర్శకత్వం వహించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమటి సాయి బాబా, చందానగర్ మాజీ కార్పొరేటర్ నవత రెడ్డి, రోజా, హరీష్ రావు, మాదాపూర్ డివిజన్ శ్రీనివాస్ గౌడ్, గోపిరాజు శ్రీనివాస్ రావు, శ్రీకాంత్, అల్లాఉద్దీన్ పటేల్, కిరణ్, క్రాంతి కిరణ్, శుభ్రాజు, మల్లారెడ్డి, రాంకిషన్ గౌడ్, విజయ్ రెడ్డి, కె.ఎన్. రాములు, బీఆర్ఎస్వీ రాజు, నరేందర్, కొండల్ రెడ్డి, శివరాజ్, మజీద్, ముజీబ్, సంతోష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. మహిళా కార్యకర్తలు, యువ నాయకులు, పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేశారు.

"తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక కేసీఆర్ఉ తెలంగాణ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే మహానాయకుడు" అని రవి యాదవ్ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ఎల్లప్పుడూ ముందుంటుందని నాయకులు ధీమా వ్యక్తం చేశారు.

## రాజయ్యపేటలో ఘనంగా నూక జాతర



అనకాపల్లి (బిఎన్ఎస్ ) : విశ్వాసానికి ప్రతిరూపం,మత్స్యకారుల ఆత్మీయ ఆరాధ్యదైవం నూక తాత జాతర రాజయ్యపేట గ్రామంలో అపూర్వ భక్తి వైభవాలతో ఘనంగా జరిగింది.మహాశివరాత్రి అనంతరం నిర్వహించే ఈ మహిమాన్విత జాతరలో నూక తాత కరుణాకటాక్షం పొందేందుకు రాష్ట్రం నలుమూలలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి తమ అచంచల భక్తిని చాటుకున్నారు. నూక తాత ఆశీస్సులు ఉంటే కష్టాలు తొలగిపోతాయని,కుటుంబాలు సుఖశాంతులతో వర్ధిల్లుతాయని తరతరాలుగా వస్తున్న విశ్వాసంతో భక్తులు నూక తాత కాలి పాదస్పర్శ పొందేందుకు రహదారిపై పడుకుని భక్తి పరాకాష్టను ప్రదర్శించారు. ఆ దృశ్యాలు భక్తి ఎంత గొప్పదో, నూక తాతపై భక్తులకు ఎంత అపారమైన నమ్మకం ఉందో ప్రతిబింబించాయి.జాతర రోజున రాజయ్యపేట గ్రామం మొత్తం ఒక పుణ్యక్షేత్రాన్ని తలపించింది.గ్రామ వీధులన్నీ భక్తులతో నిండిపోగా,భక్తుల నినాదాలతో ఆ ప్రాంతం మారుమోగింది. గ్రామస్తులు కూడా తమ ఆరాధ్య దైవానికి ఘన స్వాగతం పలుకుతూ, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విశేష సేవలు అందించారు. గ్రామ పెద్దలు, యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఏర్పాట్లు చేయడం వారి భక్తిశ్రద్ధలకు నిదర్శనంగా నిలిచింది.నూక తాతపై గ్రామస్తులకు ఉన్న అపారమైన విశ్వాసం,భక్తి ఈ జాతర ద్వారా మరోసారి చాటి చెప్పబడింది.నూక తాత తమ గ్రామాన్ని ఎల్లప్పుడూ కాపాడుతూ,మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న దైవమని భక్తులు భావోద్వేగంతో తెలిపారు.జాతర సందర్భంగా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టడంతో జాతర ప్రశాంతంగా,విజయవంతంగా ముగిసింది.నూక తాత ఆశీస్సులు అందుకున్నామనే ఆనందంతో భక్తులు భక్తి పరవశంలో తిరిగి తమ స్వగ్రామాలకు బయలుదేరారు.

## కొల్లూరులో డ్రగ్స్ దందాకు కట్టడి

**101 కిలోల గంజాయి పట్టివేత సైబరాబాద్ పోలీసుల మెరుపుదాడి!**

**కార్మికుల క్యాంపులే టార్గెట్.. ఇద్దరు అరెస్ట్, కీలక నిందితుడు పరారీలో**




శేరిలింగంపల్లి, (బిఎన్ఎస్ ): కొల్లూరులో భారీగా సాగుతున్న గంజాయి రాకెట్‌ను సైబరాబాద్ పోలీసులు ఛేదించారు. ఏకంగా 101.7 కిలోల గంజాయిను స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ విలువ సుమారు రూ. 25.72 లక్షలుగా పోలీసులు అంచనా వేశారు.

కొల్లూరు పోలీసులు, మాదాపూర్ ఎస్ఓటీ సంయుక్తంగా నిర్వహించిన మెరుపుదాడిలో ఈ విజయం సాధించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బస్వ జగన్నాథం (37), పల్లపు లక్ష్మీనారాయణ (52)లను అదుపులోకి తీసుకున్నారు. ఒడిశాకు చెందిన రాజు అనే వ్యక్తి నుంచి భారీగా గంజాయి తెప్పించి తెల్లాపూర్ పరిధిలోని శిల్పా వెంచర్ సమీప కార్మికుల క్యాంపుల వద్ద విక్రయించేందుకు నిల్వ చేసినట్లు వెల్లడైంది. ప్రధాన నిందితుడు రాజు పరారీలో ఉండగా, అతని కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. కేసును ఛేదించిన కొల్లూరు సీఐ గణేష్ పటేల్, ఎస్ఓటీ బృందాన్ని డీసీపీ సిహెచ్ శ్రీనివాస్ అభినందించారు. డ్రగ్స్ సరఫరాపై సమాచారం ఉంటే డయల్ 100 లేదా 9490617444కు తెలియజేయాలని పోలీసులు సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.

## మదనపల్లిలో అదృశ్యమైన బాలిక దారుణ హత్య

**బాలికను చంపి డ్రమ్ములో దాచేసిన నిందితుడు**

**విషాదంగా మారిన బాలిక అదృశ్యం కేసు**



అన్నమయ్య జిల్లా మదనపల్లిలో బాలిక దారుణ హత్య వెలుగు చూడటం తీవ్ర కలకలం రేపుతుంది. మదనపల్లి పట్టణం, నీరుగట్టువారిపల్లిలోని కట్లాటపల్లి రోడ్డులో కాపురం ఉంటున్న చేనేత కార్మికుడు గోపీనాథ్ కుమార్తె రిషిక ప్రియా (07) సోమవారం అదృశ్యమైన సంగతి పాఠకులకు తెలిసిందే. కాగా జిల్లా ఎస్పీ ధీరజ్ కొనిపెల్లి డీఎస్పీ మహేంద్ర సూచనల మేరకు సీఐ మహమ్మద్ రఫీ, సిబ్బందితో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాల ఫూటేజీ ఆధారంగా రిషిక ప్రియను ఓ వ్యక్తి దారుణంగా చంపి డ్రమ్ములో కుట్టినట్లు గుర్తించి హత్య జరిగిన విషయాన్ని వెలుగులోకి తీసుకువచ్చారు. మరిన్ని వివరాలను పోలీసులు వెల్లడించాల్సి ఉంది

## విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం: గంటా




భీమిలి, ఫిబ్రవరి 17(బిఎన్ఎస్ ): ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు ప్రాధాన్యమిస్తూ బడ్జెట్ లో అత్యధిక కేటాయింపులు చేసిందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమిలి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులకు మంగళవారం అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ ను తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లు అత్యుత్తమ సౌకర్యాలు కల్పిస్తున్నారని తెలిపారు. నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించడానికి ప్రణాళికలు రూపకల్పన చేసుకోవాలన్నారు. చదువుకున్న పాఠశాలకు.. తల్లిదండ్రులకు.. పుట్టిన ఊరుకు.. మంచి పేరు తెచ్చేలా ఉన్నత స్థానాలకు చేరాలని పిలుపునిచ్చారు. చిన్న వయసులో నోబెల్ బహుమతి అందుకున్న మలాల్ చెప్పినట్టు విద్యార్థి - ఉపాధ్యాయుడు - పుస్తకం - కలానికి మాత్రమే ప్రపంచాన్ని మార్చగల శక్తి ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యానికి, ఎదుగుదలకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

విద్యార్థినులు గీసిన తన చిత్రాలను చూసి అచ్చెరువొందిన గంటా

పాఠశాలకు వచ్చిన గంటా శ్రీనివాసరావు విద్యార్థినులు గీసిన తన చిత్రాలతో స్వాగతం పలకడంతో అచ్చెరువొందారు. తాము ఎంతో అభిమానంగా భావించే గంటా కు వినూత్నంగా స్వాగతం పలకాలనే ఆలోచనతో ఆయన బొమ్మలు గీశామని విద్యార్థినులు చెప్పారు. కార్యక్రమంలో

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జగదీష్, డాక్టర్ కళ్యాణి, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ పద్మావతి, భీమిలి జడ్పీటీసీ గాడు వెంకటప్పడు, కార్పొరేటర్లు గంటా అప్పలకొండ, గాడు చిన్ని కుమారి లక్ష్మి మరియు టిడిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## విద్యార్థులకు మొదటి విడత అల్బెండాజోల్ మాత్రల పంపిణీ

**నులిపురుగుల నివారణ చర్యల్లో భాగంగా ప్రతి విద్యార్థికి అల్బెండాజోల్ మాత్రలు వేయాలి- ఎంపీడీఓ యం. భవానీ**



నెల్లూరు జిల్లా రాపూరు(బి.యన్.యస్):- జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా 1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు నులిపురుగుల నివారణ చర్యల్లో భాగంగా 400 మి.గ్రా అల్బెండాజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని రాపూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ భవానీ, వేపినాపి వైద్యాధికారులు డాక్టర్ ప్రమీల రాజ్ కుమారి,సూర్య ధర్మేంద్ర,భాను, సూదర్శనం తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ భవాని మాట్లాడుతూ, పిల్లల ఆరోగ్య పరిరక్షణలో నులిపురుగుల నివారణ అత్యంత కీలకమని తెలిపారు. నులిపురుగుల వల్ల రక్తహీనత, పోషకాహార లోపం, ఎదుగుదల మందగింపు వంటి సమస్యలు తలెత్తే అవకాశమున్నందున ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని ప్రతి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రాముఖ్యతతో తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలు, కళాశాలలు, ఆంగన్‌వాడీ కేంద్రాలలో పంపిణి చేసి విద్యార్థులకు అల్బెండాజోల్ మాత్రలపై విస్తృతంగా అవగాహనా కల్పించాలన్నారు. మండలంలోని అర్హత గల పిల్లలందరికీ ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, ఐసీడీఎస్ విభాగాల సమన్వయంతో మాత్రలను పంపిణీ చేయాలని తెలిపారు. విద్యార్థులు ఆరోగ్య సిబ్బంది సూచనల మేరకు మాత్రలను తీసుకోవాలని, పరిశుభ్రత పాటించడం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం వంటి అలవాట్లు అలవరచుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులకు 400 మి.గ్రా అల్బెండాజోల్ మాత్రలను ఆమె పంపిణీ చేశారు. ఫిబ్రవరి 2026లో నిర్వహిస్తున్న ఈ మొదటి విడతలో రాపూరు మండలంలో ఒక్క సంవత్సరం వయస్సు నుంచి 19 సంవత్సరాల వయసు గల 10098 మందికి గాను 9903 మందికి అల్బెండాజోల్ మాత్రలు వేయడం జరిగిందన్నారు.నేడు గైర్హాజరైన లేదా అనారోగ్యంతో ఉన్న పిల్లలకు 24 ఫిబ్రవరి 2026 న మాప్-అప్ దినంగా అల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.కార్యక్రమంలో మండల విద్యా శాఖ అధికారి జీ. శ్రీనివాసులు,రాష్ట్ర నోడల్ అధికారి రామ మోహన్ వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ నుంచి పాపికొండలకు పెద్ద పులి



విశాఖ (బిఎన్ఎస్ ): మన్యం ప్రాంతాల్లో ప్రజానికానికి కంటి మీద కునుకు లేకుండా చేసి తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి సమీపం లో బంధించిన పెద్దపులిని పట్టుకుని విశాఖలో ఉన్న యానిమల్ రెస్క్యూ సెంటర్ కు తరలించిన విషయం విదితమే.. అయితే విశాఖ జంతు ప్రదర్శన శాల పునరావాస కేంద్రంలో వారం రోజులపాటు పెద్దపులి ఆరోగ్యం, మానసిక స్థితిని వైద్యులు పరిశీలించి పెద్దపులి ఆరోగ్యంగా ఉందని నిర్ధారించారు. అనంతరం పోలవరం జిల్లా అటవీ శాఖా ధికారి ఆధ్వర్యంలో రెస్క్యూ టీమ్ వచ్చి పెద్దపు లిని తీసుకువెళ్లి పాపికొండల్లోని జాతీయ అభయారణ్యంలో విడిచిపెట్టింది. పాపికొండల అభయారణ్యంలో పెద్ద పులులు సంచరిస్తున్నట్టు ఆనవాళ్లు ఉన్నాయని అభయారణ్యం పెద్ద పులులకు సురక్షితమని భావించి అక్కడ విడిచి పెట్టినట్లు అటవీ సంరక్షణ అధికారి ఎం. దివాన్ మైదిన్ తెలిపారు..

## ఉద్యాన వన నర్సరీ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చాయాలి

**జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా**




నెల్లూరు జిల్లా నెల్లూరు కలక్టరేట్ (బి.యన్.యస్):- జిల్లాలో ఉద్యాన వన నర్సరీ ఏర్పాటుకు పెన్నా, సంగం బ్యారేజ్ పరిసర లేక మరేదైనా ప్రాంతంలో అనువైన ప్రదేశంలో 5 సంవత్సరముల లీజు ప్రాతిపదికన అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చాయాలని సంబందిత అధికారులను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. మంగళ వారం స్థానిక కలెక్టర్ కార్యాలయములోని యస్.ఆర్.శంకరన్ వీడియో కాన్ఫరెన్సు హాలులు ఉద్యాన వన శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల ఉద్యాన వన శాఖ అధికారులు ఆయా మండలాలలో ఒక ప్రత్యేక థీం తో పనిచేసి ఆ మండలాలకు గుర్తింపు వచ్చేలా చూడాలన్నారు. నిర్దేశిత లక్ష్య సాధన కాకుండా వినూత్నంగా ఆలోచించ వలసిన అవసరం ఉందని, తదనుగుణంగా నెల్లూరు జిల్లా వైపు అందరిని ఆకర్షించేలా చేయాలన్నారు. వ్యవసాయ శాఖ ప్రాధాన్యతా రంగాలలో ఉద్యాన వన శాఖ ఒకటి అని అన్నారు. కలువాయి,సైదాపురం మరియు దుత్తలురులో ఉన్న కోల్డ్ స్టోరేజ్ లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో ఫాం పాండ్స్ ను పంచవలసిన అవసరం ఉందన్నారు. అంతే కాకుండా పాలీ హౌసెస్ లను పెంచాలని రాష్ట్రం మొత్తం నెల్లూరు వైపు చూసేలా ఉండాలన్నారు.ఉద్యాన వన అధికారులు శాస్త్రీయ దృక్పదం నుండి బయటికి వచ్చి వినూత్నంగా ఆలోచించి మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. కొత్తదనం తో పెద్ద పెద్ద ఆలోచనలు చేసి మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు, దానికి అవసరమైన నిధులు సమకూర్చడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం సూచించిన విధంగా ఒక జిల్లా ఒక ప్రాడక్ట్ గా గుర్తింపు ఉండాలన్నారు. మోడరన్ నర్సరీలు ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందన్నారు. ఉద్యాన వస శాఖ సంబందిత శాఖలతో సమన్వయ పరచుకోవాలన్నారు. ప్రతి మండలం ఒక ఉద్యాన పంటల హబ్ గా ఉండలాన్నారు.ఈ కార్యక్రమములో డి.ఆర్.డి.ఎ. ప్రాజెక్ట్ అధికారి నాగ రాజ కుమారి, మెప్మా అధికారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. తొలుత జిల్లా ఉద్యాన శాఖ అధికారి రమణా రెడ్డి ఆ శాఖ అమలు చేస్తున్న పనుల పురోగతి పే పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేసారు.

## తొర్రూరు మున్సిపల్ చైర్మన్ ఎన్నికలపై చాడ మరియా సురేఖ విమర్శలు



బిఎన్ఎస్ , వర్ధన్నపేట: తొర్రూరు మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో జరిగిన పరిణామాలపై వర్ధన్నపేట నియోజకవర్గం ఇంచార్జి, తెలుగుదేశం పార్టీ నాయకురాలు చాడ మరియా (సురేఖ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.గతంలో మంత్రి పదవిలో ఉన్న సమయంలో కూడా ఇలాంటి నీచ రాజకీయాలను తాను చూడలేదని, ముఖ్యంగా ఎర్రబెల్లి దయాకర్ రావు కాలంలో రాజకీయాల్లో కొంత విలువలు ఉన్నాయని ఆమె పేర్కొన్నారు.తొర్రూరు మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన తెరాస కౌన్సిలర్లను డబ్బులు, అధికార బలం ద్వారా బెదిరించి తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు.ఒక ఎంపీ రెండు చోట్ల ఓటు వేయడం రాజ్యాంగ విరుద్ధమని, ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి మచ్చ తెస్తాయని అన్నారు.అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా ప్రతిపక్ష నాయకులపై దాడులు, అక్రమ అరెస్టులు చేయడం దుర్మార్గమైన రాజకీయమని విమర్శించారు. 15 సంవత్సరాల తర్వాత ప్రజలు అవకాశం ఇచ్చినా, రౌడీ రాజకీయాలు చేయడం బాధాకరమని అన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారని, ఇలాంటి రాజకీయాలకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు.ప్రస్తుత రాజకీయ పరిస్థితులు అసహ్యం కలిగిస్తున్నాయని, విలువలు లేని రాజకీయాల్లో కొనసాగాలా వద్దా అన్న ఆలోచనలో ఉన్నట్లు దయాకర్ రావు మీడియా ముందు భావోద్వేగానికి లోనయ్యారని గుర్తుచేశారు. అధికార యంత్రాంగాన్ని రాజ్యాంగ విరుద్ధంగా ఉపయోగిస్తూ కాంగ్రెస్ పార్టీ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని చాడ మరియా సురేఖ మండిపడ్డారు.

## ముగిసిన దుర్గా మల్లేశ్వర బ్రహ్మోత్సవాలు

**కృష్ణా నదిలో స్నానమాచరించిన శివయ్య. వసంతోత్సవంలో తరించిన భక్తులు.**



సృష్టి స్థితి లయ కారకుడైన మహాశివుడి శివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిశాయి. స్వయంభుగా వెలసిన దుర్గమ్మ తో పాటుగా ఇంద్రకీలాద్రిపై వెలసి ఉన్న శివయ్య బ్రహ్మోత్సవాలు కృష్ణానది స్నానంతో శాస్త్రోక్తంగా ముగిశాయి.. . ఈ ఉత్సవాల్లో చివరి రోజైన మంగళవారం పూర్ణాహుతి కార్యక్రమం తో ముగిసింది. వైదిక కమిటీ భక్తిశ్రద్ధలతో, వేదమంత్రాల సాక్షిగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు వి. శివప్రసాద్ శర్మ, ఉప ప్రధాన అర్చకులు కోట ప్రసాద్ వేద పండితులు శాస్త్రోక్తంగా ఈ పూర్ణాహుతి యజ్ఞ ఫలాన్ని భక్తులందరికీ సిద్ధంపజేస్తూ, లోక కల్యాణం కోసం ఈ క్రతువును ముగించారు . యజ్ఞ యాగాదులు సంపూర్ణమైనట్లుగా భావిస్తూ అగ్నిదేవునికి శాస్త్రోక్తంగా హవిసును సమర్పించారు. అనంతరం వేద పండితులు అధికారులకు, వారి కుటుంబ సభ్యులకు ఆశీర్వచనాలు అందించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. మల్లేశ్వర స్వామి మూర్తులను, మేళ తాళాలతో అర్చక స్వాములు ఊరేగింపుగా తీసుకుని వెళ్లి కృష్ణా నదిలో వసంతోత్సవం, చక్రస్నానం, లాంటి కార్యక్రమాలను నిర్వహించారు. ప్రధాన అర్చకులు దుర్గాప్రసాద్, స్థానాచార్య శివప్రసాద్, అర్చకులు కోటా ప్రసాద్ కోటా రవి, ఈ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ , ఈ.ఓ పాలకమండలి సభ్యులు సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

# పలాసలో ఏప్రిల్ కు రైల్వేవంతెన

### జూన్ నుండి కేంద్రీయ విద్యాలయ తరగతులు

### కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



శ్రీకాకుళం (బిఎన్ఎస్ )ఫిబ్రవరి 17 : శ్రీకాకుళం జిల్లాలోని పలాస పట్టణంలో రైల్వే వంతెన నిర్మాణాలు పూర్తి చేసి ఈ ఏప్రిల్ నాటికి పూర్తిచేయాలని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సంబందిత అధికారులకు ఆదేశించారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ తో కలిసి సుడిగాలి పర్యటన చేపట్టారు. పలాస లో తొలుత కేంద్ర మంత్రి రైల్వే స్టేషన్ సమీపంలోని పై వంతెన పనులను సమీక్షించారు. ప్రాజెక్ట్ రిపోర్టును పరిశీలించి.. ప్రస్తుత స్థితిని ఆరా తీశారు. పనుల్లో ఆలస్యం జరుగుతోందని, రేయింబవళ్ళు పనులు జరగాలని స్పష్టం చేశారు. ఏప్రిల్ నాటికి వంతెనను అందుబాటులోకి తీసుకురావాలని అదేశించారు. రైల్వే వంతెన తో పాటు ఆనుకుని సర్వీసు రోడ్డు పనులు కూడా వేగంగా జరపాలని తెలిపారు.

అనంతరం అక్కడి నుండి పలాస లోని నెమలికొండ ప్రాంతాలలో త్వరలో నిర్మాణం జరగనున్న కేంద్రీయ విద్యాలయ ప్రాంతాన్ని పరిశీలించారు. భవనాలు నిర్మాణం జరిగే తీరును ప్రాజెక్టు రిపోర్టు ద్వారా కేంద్ర మంత్రికి కలెక్టర్, ఆర్డీవో వివరించారు. పాఠశాలకు అనుసంధానం అయ్యే రోడ్లు, ఇతర మౌలిక వసతులను ఆరా తీశారు.

అక్కడి నుండి పలాస పట్టణంలోని రైల్వే కాలనీలో బారక్ భవనాలను పరిశీలించారు. రాబోయే విద్యా సంవత్సరం తరగతులను ఈ భవనాలు నుండి జరపాలని నిర్ణయించిన నేపథ్యంలో రైల్వే అధికారులతో గదుల అప్పగింతపై అనుమతుల సమస్యను పరిష్కరించారు. కేంద్రీయ విద్యాలయ అధికారులతో సమన్వయం చేసుకుని ఈ ఏడాది తరగతులు పక్కగా నిర్వహించాలని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా మీడియా రామ్మోహన్ నాయుడు మాట్లాడారు.

పలాస పరిసర ప్రాంతాలతో పాటు జిల్లా వాసుల ఎన్నో ఏళ్ల కల అయిన, పలాస ాాదీ ప్రాజెక్టు ఇప్పుడు వేగంగా నిర్మాణం జరుగుతూ ఉండటం ఆనందంగా ఉందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దీనికి అత్యున్నత ప్రాధాన్యత ఇచ్చి, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులను తిరిగి ప్రారంభించామని తెలిపారు. భారతీయ రైల్వే మరియు జిల్లా యంత్రాంగం సమన్వయంతో నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. ఈ ాాదీ పూర్తి అయితే పలాస పట్టణంలో ట్రాఫిక్ రద్దీ తగ్గి ప్రయాణికులకు సౌకర్యవంతమైన రాకపోకలు కలుగుతాయని అన్నారు.

అలాగే పలాస లో ఏర్పాటు కానున్న కేంద్రియ విద్యాలయానికి తాజా వివరాలను వెల్లడించారు. రాబోయే విద్యాసంవత్సరం నుండే తరగతుల నిర్వహణ కోసం ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రైల్వే అధికారులతో మాట్లాడి బారెక్ భవనాలకు సంబంధించిన అనుమతుల సమస్యను పరిష్కరించామని తెలిపారు. ఈ పాఠశాల ద్వారా సాయుధ దళాల సిబ్బంది, కేంద్ర సంస్థల ఉద్యోగుల పిల్లలకు నాణ్యమైన విద్యా అవకాశాలు లభిస్తాయనీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు, రెవెన్యూ, రైల్వే అధికారులు స్థానికులు పాల్గొన్నారు.

# నూతన మున్సిపల్ చైర్మన్ తుమోల్ల దత్తుకు ఘన సత్కారం

### శ్రీ సరస్వతీ విద్యాపీఠం అధికారులను కలిసి ఆశీస్సులు పొందిన దత్తు.. అమ్మవారి శేషవస్త్రంతో సన్మానం

బైంసా,బిఎన్ఎస్ : నిర్మల్ జిల్లా బైంసా మున్సిపల్ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన తుమోల్ల దత్తు మంగళవారం స్థానిక పూలేనగర్‌లోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ సుభద్ర నిలయం పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పలువురు ప్రముఖులను కలిసి, వారి మార్గదర్శకత్వం మరియు ఆశీర్వాదాలను తీసుకున్నారు.

ఆశీర్వదించిన లింగం సుధాకర్ రెడ్డి, అన్నదానం సుబ్రహ్మణ్యం

మున్సిపల్ పీఠాన్ని అధిష్టించిన అనంతరం దత్తు గారు, శ్రీ సరస్వతీ విద్యాపీఠం దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన మంత్రి లింగం సుధాకర్ రెడ్డి గారిని, క్షేత్ర ప్రశిక్షణ ప్రముఖ్ రావుల సూర్యనారాయణ మరియు స్ఫూర్తి పత్రిక సంపాదకులు అన్నదానం సుబ్రహ్మణ్యం గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. బైంసా పట్టణ అభివృద్ధికి మరియు ప్రజలకు సేవ చేయడానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా వారికి వివరించారు. దత్తు గారికి వారు శుభాకాంక్షలు తెలుపుతూ, బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆశీర్వదించారు.

బాసర అమ్మవారి కండువాతో సత్కారం

ఈ భేటీలో ఒక విశేష ఘట్టం చోటుచేసుకుంది. నూతనంగా బాధ్యతలు చేపట్టిన దత్తు గారిని, ప్రముఖులు బాసర జ్ఞాన సరస్వతీ అమ్మవారి సన్నిధి నుంచి ప్రత్యేకంగా తీసుకువచ్చిన శేషవస్త్రం (కండువా) తో సత్కరించారు. అమ్మవారి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని, పట్టణ ప్రగతిలో ఆయన కీలక పాత్ర పోషించాలని వారు ఆకాంక్షించారు.

అభివృద్ధికి నా ప్రాధాన్యత: చైర్మన్ దత్తు

సన్మానం అనంతరం చైర్మన్ దత్తు మాట్లాడుతూ.. ప్రముఖుల ఆశీస్సులు పొందడం తనకి ఎంతో బలాన్ని ఇచ్చిందని తెలిపారు. "బైంసా పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం. విద్య, వైద్యం, పారిశుద్ధ్యం మరియు మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తాను. అందరి సహకారంతో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను" అని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పలువురు ప్రముఖులు మరియు అనుచరులు పాల్గొన్నారు.

## బ్రహ్మంగారిమఠం మండలానికి గర్వకారణం : జేఈఈ మెయిన్స్‌లో 97.37 శాతం సాధించిన సానం భావన రెడ్డి



బ్రహ్మంగారిమఠం మండలం జి నరసింహపురం గ్రామానికి చెందిన సానం భావన రెడ్డి అనే విద్యార్థి జేఈఈ మెయిన్స్ ఫలితాలలో 97.37 శాతం మార్కులతో తమ ప్రతిభను కనబర్చటం పట్ల ఆ గ్రామ ప్రజలతో పాటు మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆ విద్యార్థి తండ్రి సానం శ్రీనివాసులు రెడ్డి ప్రస్తుతం పోరుమామిళ్ల డివిజన్ ఉద్యానవన శాఖ అధికారిగా పనిచేస్తున్నారు. పదవ తరగతి ఫలితాల్లో కూడా మంచి ప్రతిభ కనబడటం జరిగినది ప్రస్తుతం ఆ విద్యార్థి బీరం విద్యాసంస్థలలో విద్యను అభ్యసిస్తున్నది

# దైవప్రవక్త ముహమ్మద్ (స) పట్ల అపార భక్తిని చాటిన వాగ్దాత్త మసీహ జీవితం ఆదర్శం





బిఎన్ఎస్ :అహ్మదీయ ముస్లిం జమాత్ అంతర్జాతీయ ఆధ్యాత్మిక అధినేత, ఐదవ ఖలీఫా హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ లండన్‌లోని టిల్‌ఫోర్డ్ ప్రాంతంలో ఉన్న ముబారక్ మసీదులో శుక్రవారం ఉపన్యాసాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన వాగ్దాత్త మసీహ్ హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ (అలైహిస్సలాం) దైవప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) పట్ల ప్రదర్శించిన అచంచల ప్రేమ, విధేయత, ఆధ్యాత్మిక ఉన్నతిని విశదీకరించారు. వాగ్దాత్త మసీహ్ చిన్నతనం నుంచే క్రమశిక్షణతో కూడిన భక్తి జీవితం గడిపారని ఖలీఫా పేర్కొన్నారు. రాత్రివేళ తహజ్జుద్ ప్రార్థనలు, పవిత్ర ఖురాన్ పఠనం, సామూహిక నమాజ్‌లలో నియమితంగా పాల్గొనడం ఆయన జీవితంలో భాగమైందని తెలిపారు. ఆయన పాటించిన రహస్య ఉపవాసాలు, నిస్వార్థ సేవా భావాన్ని కూడా ఖలీఫా ప్రస్తావించారు. తన భక్తిని ఎప్పుడూ ప్రదర్శనగా మార్చకుండా, ఉపవాసాల సమయంలో తనకు వచ్చిన ఆహారాన్ని అవసరమైన వారికి అందించేవారని చెప్పారు. ఈ విధంగా దేవుని కోసం నిశ్శబ్దంగా త్యాగ జీవితం గడిపారని వివరించారు. ఉపవాస దీక్షల సమయంలో వాగ్దాన మసీహ్ అనుభవించిన ఆధ్యాత్మిక దర్శనాలను వివరిస్తూ, దేవుని ప్రేమకు ప్రతీకలైన జ్యోతి స్తంభాలను ఆయన చూశారని ఖలీఫా తెలిపారు. ఈ అనుభవాలు భౌతిక ప్రపంచ ఆనందాలకు అతీతమైన ఆధ్యాత్మిక పరమానందాన్ని అందించాయని చెప్పారు. ఉపన్యాసాన్ని ముగిస్తూ, వాగ్దాత్త మసీహ్ జీవితం నేటి ముస్లింలకు ఆదర్శమని, దైవప్రవక్త బోధనలను ఆచరణలో చూపించిన జీవ సాక్ష్యమని ఖలీఫా పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో నడిచే శక్తిని అందరికీ ప్రసాదించాలంటూ ప్రార్థనతో ఉపన్యాసాన్ని ముగించారు.

## ఏడ్చిన ఎర్రబెల్లి దయాకర్ రావు- తొర్రూరు రాజకీయాల్లో సంచలనం



బిఎన్ఎస్ , వరంగల్: తొర్రూరు మున్సిపల్ రాజకీయాల్లో అనూహ్య పరిణామాల మధ్య మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు బహిరంగంగానే కన్నీరు పెట్టుకోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ప్రస్తుత రాజకీయాలను చూస్తుంటే రాజకీయాల్లో కొనసాగాలా వద్దా అనే ఆలోచన వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తొర్రూరు మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో లాటరీ విధానంలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం సాధించడం ఆయనకు తీవ్ర నిరాశ కలిగించింది. కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు తాను ఏ సమాధానం చెప్పాలో అర్థం కావడం లేదని భావోద్వేగానికి లోనయ్యారు. మున్సిపల్ కార్యాలయానికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడం, పోలీస్ స్టేషన్‌లో ఉంచడం పరిస్థితిని మరింత ఉద్రిక్తం చేసింది. తొర్రూరు మున్సిపాలిటీలో మొత్తం 16 కౌన్సిలర్ స్థానాలు ఉండగా, భారత రాష్ట్ర సమితి పార్టీ 9 స్థానాలు, కాంగ్రెస్ 7 స్థానాలు గెలుచుకుంది. సాధారణంగా చైర్మన్ పదవి బీఆర్ఎస్‌కే దక్కాల్సి ఉన్నప్పటికీ, చివరి నిమిషంలో ఒక కౌన్సిలర్ కాంగ్రెస్ వైపు మొగ్గు చూపడంతో సమీకరణాలు మారిపోయాయి. ఓట్లు చెరో ఎనిమిదికి చేరడంతో తుది నిర్ణయం లాటరీపై పడింది. లాటరీలో కాంగ్రెస్ కౌన్సిలర్ తూనం శ్రవణ్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఎక్స్ ఆఫీషియో ఓటు అంశంపై వివాదం నెలకొనడంతో పరిస్థితి మరింత క్లిష్టమైంది. దీర్ఘకాలంగా తన ఆధిపత్యంలో ఉన్న ప్రాంతంలో ఈ పరిణామం ఎర్రబెల్లికి కోలుకోలేని దెబ్బగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో యువ నాయకురాలు యశస్విని రెడ్డి చేతిలో ఓటమి పాలైన ఆయనకు, ఇప్పుడు మున్సిపల్ ఫలితం మరింత భావోద్వేగానికి గురిచేసింది. మీడియా ముందు స్పందించిన ఎర్రబెల్లి, విలువలు లేని రాజకీయాలు అసహ్యం కలిగిస్తున్నాయని, రాజ్యాంగ విరుద్ధంగా అధికార యంత్రాంగాన్ని ఉపయోగిస్తున్నారని కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. పార్టీ కోసం రాత్రింబవళ్లు కష్టపడిన తన కేడర్‌ను ఎలా నమ్మబలుకాలో అర్థం కావడం లేదని చెప్పుతూ ఆయన భావోద్వేగానికి లోనయ్యారు.

## తమ్మడపల్లి జి గ్రామంలో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు





బిఎన్ఎస్ , జఫర్గఢ్ ఫిబ్రవరి 17: జనగామ జిల్లా జఫర్గఢ్ మండలం తమ్మడపల్లి జి గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావు జన్మదినం సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి ఆనందోత్సాహాల మధ్య సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనించిందని కొనియాడారు. ఆయన చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజల మన్ననలు పొందాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు మారపల్లి కుమార్‌తో పాటు ముహమ్మద్ బషీర్, యాదగిరి , రాములు,సారయ్య, నాగరాజు,అంకూస్, కరుణాకర్, రియాజ్, నాగేష్ మరియు ఇతర పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సినిమా న్యూస్



## ప్రభాస్‌కు దాని గురించి ఏం తెలియదు

ఒకప్పుడు టాలీవుడ్‌లో గోల్డెన్ లెగ్‌గా వెలిగిపోయిన టాలీవుడ్ బుట్టబొమ్మ పూజా హెగ్డే, వరుస ఫ్లాపులతో కాస్త వెనకబడినప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం ఎప్పుడూ హాట్ టాపిక్‌గానే ఉంటోంది. నిత్యం వార్తల్లో నిలుస్తోంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న పూజా, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట పెద్ద దుమారాన్నే రేపుతున్నాయి. ప్రభాస్ అభిమానులు ఆమెపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజా ఇంటర్వ్యూలో పూజా హెగ్డేకు ఒక ఆసక్తికరమైన ప్రశ్న ఎదురైంది. "సోషల్ మీడియా వాడకం అస్సలు తెలియని లేదా చాలా తక్కువగా వాడే స్టార్ హీరో ఎవరు?" అని అడగ్గా.. పూజా ఏమాత్రం తడబడకుండా ప్రభాస్ అని చెప్పేసింది.

అంతటితో ఆగకుండా.. "నిజం చెప్పాలంటే ప్రభాస్‌కు సోషల్ మీడియా గురించి ఏమీ తెలియదు. ఆయన అకౌంట్స్ అన్నీ ఒక టీమ్ చూసుకుంటుంది. ఆయన ఎప్పుడూ అందులో యాక్టివ్‌గా ఉండడు. నేను చూసిన ఎంతోమంది స్టార్స్‌లో అతను సోషల్ మీడియాని తక్కువ వాడతారు" అంటూ నవ్వేసింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో అది చూసిన ప్రభాస్ ఫ్యాన్స్ సోషల్ మీడియాలో రచ్చ మొదలుపెట్టారు. మా డార్లింగ్‌కు సోషల్ మీడియా తెలియకపోవడం ఏంటి? ఆయనకు హడావుడి చేయడం ఇష్టం ఉండదు అంతే అంటూ కౌంటర్లు ఇస్తున్నారు. మరికొందరైతే.. నీకు వరుసగా ఫ్లాపులు వస్తున్నాయి కాబట్టే.. మా హీరో పేరు వాడుకుని వార్తల్లో ఉండాలని చూస్తున్నావా? అంటూ ఘాటుగా విమర్శిస్తున్నారు.

నెట్టింట పూజా హెగ్డేను టార్గెట్ చేస్తూ ట్రోల్స్ వస్తున్నాయి. కాగా.. ప్రభాస్ సినిమాల విషయానికొస్తే.. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్' అంటూ ఖాకీ దుస్తులు తొడుగుతున్నాడు, మరోవైపు హను రాఘవపూడితో 'ఫౌజీ' లో యుద్ధం చేస్తున్నాడు. 'కల్కి-2', 'సలార్-2' వంటి భారీ ప్రాజెక్టులతో ఫుల్ బిజీ బిజీగా గడుపుతున్నాడు. ఇలాంటి టైమ్‌లో 'రాధే శ్యామ్' సినిమాలో తనతో నటించిన పూజా.. ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. పూజా సరదాగా అన్నప్పటికీ, డార్లింగ్ ఫ్యాన్స్ మాత్రం ఆమెను వదిలేలా కనిపించడం లేదు!

## ది ప్యారడైజ్ ఫస్ట్ సింగిల్ విడుదల తేదీ




నాచురల్ స్టార్ నాని ప్రస్తుతం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్'లో హీరోగా నటిస్తున్నాడు. మోహన్ బాబు, సంపూర్ణేష్ బాబు, సోనాలి కులకర్ణి ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి అనుదీప్ రవిచంద్రన్ సంగీతం అందిస్తున్నాడు. సుధాకర్ చెరుకూరి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ మూవీని నిర్మిస్తున్నాడు. ఆగస్టు 21వ తేదీన ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సినిమా విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో తాజాగా ఈ మూవీ మేకర్స్ ఈ సినిమాకు సంబంధించిన మొదటి సింగిల్ విడుదల తేదీని అనౌన్స్ చేశారు.

'ఆయా షేర్' అంటూ సాగే ఈ మూవీలోని ఫస్ట్ సింగిల్ ను ఫిబ్రవరి 24వ తేదీన విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. అనిరుద్ రవిచంద్రన్ సంగీతం అందిస్తున్న మూవీ కావడం, ఫుల్ మాస్ ఎంటర్టైనర్ గా ఈ చిత్రం రూపొందుతూ ఉండడంతో ఈ ఆల్బమ్ పై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఉన్నాయి. దానితో ఈ మొదటి సింగిల్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటుందని, ముఖ్యంగా యూత్ ను చాలా బాగా అలరిస్తుందని మూవీ యూనిట్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

## కాపీరైట్ పోరులో ఇళయరాజాకు ఎదురుదెబ్బ

### 134 సినిమాల సంగీతంపై ఢిల్లీ హైకోర్టు ఆంక్షలు




134 సినిమాల సంగీతంపై కోర్టు ఆంక్షలు విధించింది. తన సంగీతానికి సంబంధించి రాయల్టీ, పేటెంట్ హక్కుల కోసం నిర్మాతలు, మ్యూజిక్ కంపెనీలపై న్యాయపోరాటం చేసిన ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాకు ఇప్పుడు ఢిల్లీ హైకోర్టులో చుక్కెదురైంది. ఆయన కంపోజ్ చేసిన దాదాపు 134 సినిమాల సౌండ్ రికార్డింగ్స్, మ్యూజిక్ వాడకంపై న్యాయస్థానం తాత్కాలికంగా ఆంక్షలు విధించింది. సరిగమ మ్యూజిక్ సంస్థ వద్ద ఆయా సినిమాల సంగీత హక్కులు ఉన్నాయని, ఇళయరాజా వాటిని డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో అప్‌లోడ్ చేయడంపై సదరు సంస్థ కోర్టును ఆశ్రయించడంతో ఈ పరిణామం చోటు చేసుకుంది.

నిజానికి గత కొంతకాలంగా తమిళ చిత్రాల కాపీరైట్ హక్కుల విషయంలో ఇళయరాజా, నిర్మాణ సంస్థల మధ్య తీవ్రస్థాయిలో పోరు నడుస్తోంది. తాను సృష్టించిన సంగీతంపై పూర్తి హక్కులు తనకే ఉంటాయని ఆయన వాదిస్తుండగా, తాము పెట్టుబడి పెట్టినందున ఆ హక్కులు తమకే దక్కుతాయని నిర్మాతలు వాదిస్తున్నారు. ఇప్పుడు తాజాగా సరిగమ సంస్థకు అనుకూలంగా కోర్టు ఆదేశాలు రావడంతో, డిజిటల్ మాధ్యమాల్లో ఆయన పాత సూపర్ హిట్ సాంగ్స్ వాడకంపై సందిగ్ధత నెలకొంది. ఇప్పటికే ఒక తమిళ పాట కాపీరైట్ విషయంలో వీరి మధ్య వివాదం కొనసాగుతుండగానే, తాజా తీర్పు ఇళయరాజాకు పెద్ద షాక్‌గానే పరిగణించవచ్చు.

## నువ్వు హీరోవా అని అందరి ముందు అవమానించారు



టాలీవుడ్‌లో ఎలాంటి బ్యాగ్రౌండ్ లేకుండా, కేవలం ప్రతిభతో ఎదిగిన హీరోలలో సుహాస్ ఒకరు. 'కలర్ ఫోటో' సినిమాతో నేషనల్ అవార్డ్ అందుకుని ప్రామిసింగ్ హీరోగా పేరు తెచ్చుకున్న సుహాస్, త్వరలో 'హే బలవంత్' సినిమాతో ఫిబ్రవరి 20న థియేటర్లలోకి రాబోతున్నాడు. ఈ సందర్భంగా జరిగిన ప్రమోషన్లలో సుహాస్ ఒక చేదు జ్ఞాపకాన్ని పంచుకున్నారు. తన కలర్ గురించి ఒక రిపోర్టర్ చేసిన కామెంట్ తనను ఎంతగానో హర్ట్ చేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. ఇటీవల నటుడు సత్యం రాజేష్‌తో జరిగిన ఒక ఇంటర్వ్యూలో సుహాస్ గతంలో జరిగిన ఒక ఇన్సిడెంట్‌ను గుర్తు చేసుకున్నారు. " నిన్ను ఎవరో వేదికపైనే.. అసలు నువ్వు హీరోవా అని అందరిముందే అడిగారు కదా .. అప్పుడు నువ్వు హర్ట్ అయ్యావా?" అని సత్యం రాజేష్ ప్రశ్నించగా.. దానికి సుహాస్ బదులిస్తూ.. "నిజానికి ఆ ప్రశ్న నన్ను మొదట్లో చాలా బాధించింది.

కానీ ఆ తర్వాత.. సరేలే, ఇలాంటి ప్రశ్నలు అందరినీ అడగలేరు కదా అని నన్ను నేను సమాధాన పరుచుకున్నాను" అంటూ ఎమోషనల్ అయ్యాడు. సాధారణ వ్యక్తి ఇండస్ట్రీలో ఎదిగేటప్పుడు ఇలాంటి విమర్శలు ఎదురవ్వడం సహజమని, వాటిని దాటుకుని ముందుకు సాగడమే తన లక్ష్యమని సుహాస్ చెప్పారు. బాహ్య రూపం కంటే నటన మీద, కథ మీద తనకు నమ్మకం ఎక్కువని ఆయన స్పష్టం చేశాడు. సుహాస్ మాటలకు సత్యం రాజేష్ స్పందిస్తూ.. "నువ్వు యూట్యూబ్ రోజుల్లోనే స్టార్ ఇమేజ్ తెచ్చుకున్నావు, నిన్ను ఎవరూ జడ్జ్ చేయలేరు" అంటూ ప్రశంసించాడు. తన ప్రయాణం ఎంతో మంది యువ నటులకు స్ఫూర్తినిస్తుందని, ప్రేక్షకులే తన బలమని సుహాస్ ఆశాభావం వ్యక్తం చేశాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది.